జాయింట్ ఎల్‌పిఎంకు 31వరకు గడువు : జెసి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో సొంత భూమి కలిగిన భూ యజమానులందరూ జాయింట్ ఎల్‌పిఎం విభజన కోసం దరఖాస్తులను ఈ నెల 31లోపు తప్పనిసరిగా సంబంధిత సచివాలయాలు లేదా మీసేవ కేంద్రాలలో సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక అవకాశం వల్ల డిసెంబర్ 31వరకు దరఖాస్తు రుసుం కేవలం రూ.50మాత్రమే ఉంటుందని దీనిని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. డిసెంబర్ 31 తర్వాత ఈ రుసుం రూ.550కి పెరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకుని, జాయింట్ ఎల్‌పిఎం విభజన చేయించుకోని భూ యజమానులు వెంటనే తమ సచివాలయాలు, మీ-సేవ కేంద్రాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. భూ రికార్డులు సక్రమంగా ఉండడం భవిష్యత్తులో భూ సంబంధిత అన్ని సేవలు పొందటానికి అత్యంత అవ సరమని పేర్కొన్నారు. భూయ జమానులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

- ధర్నాలో వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలో అసైన్డ్, సీలింగ్, ఇరిగేషన్ భూములను పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం ముందు వ్యవసాయ కూలీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టాలన్నారు. గత ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయటం వల్లనే వైసిపి ప్రభుత్వాన్ని గ్రామీణ పేదలు ఇంటికి సాగనంపారన్నారు. సిఎం చంద్రబాబు భూకబ్జాలపైన శ్వేత పత్రం విడుదల చేసి వదిలేయకుండా భూకబ్జాదారుల వద్ద ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం భూసీలింగ్ యాక్ట్ అమలు చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా అరికట్టచ్చని తెలిపారు. మండలంలో దళితులు, పేదలు భూముల కోసం వేడు కుంటున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వమైనా పేదలకు భూములు పంపిణీ చేసి పట్టాలివ్వాలని కోరారు. దళితుల శ్మశాన భూముల సమస్యలు, కనీస సౌకర్యాల కొరతను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మావిళ్ల వెంకటాచలపతి, పి.నరసింహులు, బి.నాగరాజు, టి.శ్రీనివాసులు, సరో జమ్మ రమణప్ప, అనిత, గంగారాణి స్వప్న, టి.రమణ, బి.మోషేష్, దీప పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 31 నుంచి జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ఉపాధ్యక్షులు ఎస్.ఓబుళమ్మ వ్యవసాయకార్మిక సంఘం జిల్లానాయకులు మండెం. సుధీర్‌కుమార్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యం లక్ష్మిదేవి తెలిపారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మహాసభల గోడ పత్రాలు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశ వ్యాప్తంగా 2వేల మంది ప్రతినిధులు, 10 దేశాలు నుంచి కార్మిక సంఘాలు నాయకులు హాజరు కానున్నారన్నారన్నారు. జనవరి 4 తేదీన లక్ష మందితో బహిరంగ సభ జరగనుందని తెలిపారు. డిసెంబర్ 27 నుంచి జనవరి 2 తేదీ వరకు సాంస్కృతిక ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. సాంస్కృతిక ఉత్సవాలకు ప్రముఖ సినీ నటులు ప్రకాశరాజ్, సుద్దాల అశోక్‌తేజ్, సింగర్ మంగ్లీ మరి కొందరు హాజరు కానున్నారని తెలిపారు. విజయనగరం జిల్లాలో ఉన్న ప్రజలు,కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లు అధిక సంఖ్యలో పాల్గొని 4న జరగనున్న బహిరంగ సభను, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. మహాసభల్లో కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్లు రద్దు కోసం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలనీ, స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలబిల్డింగ్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలనీ, హమాలీ, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్‌ఫోర్ట్ తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చర్చిస్తారని చెప్పారు. మహాసభలకు అన్ని వర్గాలు ప్రజలు,కార్మికులు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేయాలని కోరారు. మండల సీఐటీయూ నాయకులు సద్దల . భాస్కర్, మహ్మద్, నారాయణ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

రాజీనామా చేసి దీక్షలు చేయాలి :'చమర్తి'

జెఎసి దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేటకు వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి తప్పు చేశారని స్థానిక వైసిపి నాయకులు ప్రకటించి స్వచ్ఛందంగా పార్టీకి, పదవులకు రాజీనామా చేసి జెఎసితో కలిసి జిల్లా కేంద్రం కోసం ఉమ్మడిగా పోరాడాలని రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం రాజంపేట జిల్లా సాధన కోసం జెఎసి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ కూడలిలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లా డుతూ రాజంపేట జిల్లా సాధన కోసం ఆనాడు వైసిపి నాయకులు పోరాడకుండా నేడు నాలుగు దండలు వేసుకుని మొసలి కన్నీరు కారిస్తే జిల్లా కేంద్రం ఎలా వస్తుందని ప్రశ్నించారు. గత వైసిపి హాయంలో ఉమ్మడి కడప జిల్లా విభజన జరిగిన సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేయడం ఎంతో సులువుగా ఉండేదన్నారు. ఆ దిశగా నాటి జడ్‌పి చైర్మన్, నేటి ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, వైసిపి నాయకులు పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రాజంపేట జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం చిత్తశుద్ధితో పోరాటం చేయాలని, ఈ ప్రాంత వాసిగా తన సంపూర్ణ సహకారం జెఎసికి అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, అబ్బూరి ప్రభాకర్ నాయుడు, బుక్కే రాజశేఖర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్, జెఎసి సభ్యులు నీలి ఈశ్వరయ్య, చల్లా సుధాకర్, చిట్వేలి రవికుమార్, సికిందర్, జనసేన మీడియా కో-ఆర్డినేటర్ చింతల శివ, సమ్మెట శివప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌జిఒ అసోషియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

- అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసన్

నూతనంగా ఎన్నికైన జిల్లా ఎన్‌జిఒ అసోసియేషన్ కార్యవర్గం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లా ఏపిఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. స్థానిక ఎన్‌జిఒ సభాభవనంలో జిల్లా కార్యవర్గానికి ఎన్నిక ప్రక్రియ జరిగింది. జిల్లా ఎన్నికల అధికారిగా చిత్తూరు జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు రాఘవులు, సహాయ ఎన్నికల అధికారిగా రమేష్, పరిశీలకుడుగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, పర్యవేక్షకులుగా ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు వ్యవహరించారు. నామినేషన్ల దాఖలు ప్రక్రియ అనంతరం ఒక్కొక్క పోస్టుకు ఒక అప్లికేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికలలో అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షులుగా ఎం.వేణుగోపాలరెడ్డి(మెడికల్), సహాధ్యక్షులుగా డి.వి.శివారెడ్డి(హెల్త్) ఎన్నికయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులుగా పి. మహాదేవ, ఇ.నరసింహ, పి.సిద్దయ్య, సి.గణేష్, డి.ధీరజ్, ఉపాధ్యక్షులుగా వై.స్వర్ణలత ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జె.శ్రీనివాసన్, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.హరి ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా వై.రాజశేఖర్‌రెడ్డి, వై.వి.వంశీ ప్రసాద్, కె.సందీప్ కుమార్‌రెడ్డి, విజయలక్ష్మి, వి.జ్యోతి ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి (మహిళ)గా ఎం.అంజనమ్మ, కోశాధికారిగా జి.నాగేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన కార్యవర్గంను కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నిత్యపూజయ్య, ఉపాధ్యక్షులు సిద్దయ్య, పద్మనాభరావు, బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఆర్.జయచంద్రలు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్నిక కార్యక్రమంలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, మదనపల్లి, వాల్మీకిపురం తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కరాటే విజేతలతో రత్నం స్కూల్ కరస్పాండెంట్ మమతా వేదాంత్‌రెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-పీలేరు: క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని రత్నం స్కూల్ కరస్పాండెంట్ మమతా వేదాంత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి అవిలాలలోని జిఎస్ఆర్ మాగ్నెట్ స్కూల్లో ఈ నెల 7న 'స్టేట్ కరాటే కప్-2025' పోటీలు జరిగాయి.పీలేరు రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొని తమ అసాధారణ ప్రతిభను ప్రదర్శించి, పాఠశాలకు, పట్టణానికి గర్వకారణంగా నిలిచారని అన్నారు. బుధవారం స్థానిక రత్నం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో కరస్పాండెంట్ వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో సత్తా చాటి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తమ పాఠశాల విద్యార్థులు ఆర్. లీలానంద్ రెడ్డి, ఎస్.భవిష్య, ఆర్. చేతనారెడ్డి, ఎస్. తస్లీమ్, ఎస్.డి.ఆయిషా, కె.గీతిక, ఎస్. షాదాబ్, ఎం.హార్దిక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు చూపిన నైపుణ్యం, క్రమశిక్షణ ప్రశంసనీయమన్నారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు విజయం సాధించడం తమకెంతో గర్వకారణమని చెప్పారు. విజేతలకు కరాటే పోటీల నిర్వాహకులు జ్ఞాపికలతో పాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్, పాఠశాల సిబ్బంది మమత, రాజ్యలక్ష్మి, రిజ్వానా, రత్నం స్కూల్ యోధ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సభ్యులు పాల్గొని విజేతలను అభినందించి, హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు నలుగురు ఎంపిక

ప్రజాశక్తి-కడప అర్బన్ : రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని బాక్సింగ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, కార్యదర్శి విజయ్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ మైదానంలో జరిగిన వైఎస్ఆర్ కడప జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికల్లో గెలుపొందిన వారు ఈ నెల 13, 14వ తేదీలలో విజయవాడ లయోలా కాలేజీ లో నిర్వహించనున్న ఆంధ్ర రాష్ట్ర బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా తరపున 50, 55 కిలోల లోపు తిరుపతి ఆంజనేయులు, 55 నుంచి 60 కిలోల లోపల షేక్ మహమ్మద్ అలీ, 60 నుంచి 65 కిలోల లోపల శ్రీనివాసులు తలారి, 70 నుంచి 75 లోపల చిత్తా రవికాంత్ ఎంపికయ్యాలని చెప్పారు. జిల్లా తరపున వీరు ప్రాతినిధ్య వహిస్తారని పేర్కొన్నారు. బాక్సింగ్ ఎంపికలకు ముఖ్య అతిథిగా జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్ మొహిద్దిన్ హాజరయ్యారు.

సిఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం రాత్రి అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిసి నెమలి ప్రతిమను అందించి, శాలువాతో సన్మానించారు. కొత్త ఏడాది నుండి అందుబాటులోకి రానున్న మదనపల్లి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, అధికారులకు వసతి సౌకర్యాలు, మదనపల్లి జిల్లా అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాస్థాయి అధికారుల భవనాల గురించి, టమోటో మార్కెట్ యార్డ్ స్థలం సేకరణపైన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి వినతి పత్రం అందించినట్లు తెలిపారు. మదనపల్లి పట్టణా భివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పన, రహదారులను అభివ ృద్ధి చేయాల్సిన ఆవశ్యకతపైన సిఎంకు వివరించినట్లు తెలిపారు.

సిఎం చంద్రబాబుకు నెమలి ప్రతిమను ఇస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నీహిరాకు చోటు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు దక్కించుకున్న సాయి నీహిరా

ప్రతిభతో పాటు పథకాలు సాధించినప్పుడే కరాటే విద్యార్థులకు తగిన గుర్తింపు వస్తుందని విజయభారతి స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.సేతు పేర్కొన్నారు. కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో 2వ తరగతి చదువుతున్న ఎన్.ఎస్.నిశ్చిత, అర్.యస్వంత్ దంపతుల కుమార్తె అర్.సాయి నీహిరా వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. ఒక నిమిషంలోపు 170 పంచులు ప్రదర్శించి అతి చిన్న వయసులో వరల్డ్ రికార్డును కైవసం చేసుకుంది. కలామ్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నిర్వాహకులు కుమార్వెల్ సర్టిఫికెట్, మెమెంటాను అందజేశారు. ఈ సందర్భంగా విజయభారతి స్కూల్ చైర్మన్ డాక్టర్ యన్.సేతు మాట్లాడుతూ కరాటే మాస్టర్ మాణిసాయి పిల్లలకు కరాటే నేర్పించే విధానం పిల్లలకు ఆకర్షణీయంగా ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు స్వర్గీయ గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎ.ఆర్.సురేష్ శిక్షణ, ఆశీస్సులతో మాకు సాధ్యమయిందని యూత్ కరాటే క్లబ్ ప్రెసిడెంట్ రెన్షి యమ్. మనిసాయి స్పష్టం చేశారు.

పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణకు సన్నాహాలు

- శిక్షణ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల(ఎస్‌సిటిపిసి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డిటిసి) బుధవారం ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, కిచెన్ రూమ్, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్స్ ను పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, డి.టి.సి ఇన్స్పెక్టర్ ఎస్.వినయ్ కుమార్ రెడ్డి, ఆర్.ఎస్.ఐ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-వాల్మీకిపురం: రాష్ట్ర ఉర్దూ అకాడమీ నూత చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మొహమ్మద్ ఫరూక్ శుబ్లీని బుధవారం జిల్లా ఉర్దూ అకాడమీ ఉద్యోగులు కలుసుకున్నారు. విజయవాడలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయనను కలుసుకొని, పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఉర్దూ అకాడమీకి అవసరమైన సదుపాయాలు, సౌకర్యాలు, తదితర పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. దీనిపై స్పందించిన చైర్మెన్ మొహమ్మద్ ఫరూక్ శుబ్లీ మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఉద్యోగులు పాల్గొన్నారు.

జడ్‌పి హైస్కూల్‌ను పరిశీలించిన సమగ్ర శిక్ష ఎపిసి

ప్రజాశక్తి-రాజంపేట : స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలను సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ ఎన్.అనురాధ, సిఎంఒ కరుణాకర్, ఎఇ జిలానీ భాష సందర్శించారు. పిఎంశ్రీ ఇండియా కింద మంజూరైన ఆట స్థలం, కంప్యూటర్లు, ప్రయోగశాల, కెమిస్ట్రీ ప్రయోగశాల, గ్రంథాలయాలను తనిఖీ చేశారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించి తగిన సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.జయలక్ష్మి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి చేశారని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఇఒఇలు కె.రఘునాథరాజు, డి.సుబ్బరాయుడు, పుల్లంపేట ఎఇఒ చక్రధర్ రాజు పాల్గొన్నారు.

చమర్తిని, సొసైటీ చైర్మన్‌లను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

సింగిల్ విండో చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-రాజంపేట

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో ఎబి.చంద్రారెడ్డి గార్డెన్స్‌లో బుధవారం సింగిల్ విండో చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. మన్నూరు సొసైటీ చైర్మన్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, డైరెక్టర్లు బండారు రెడ్డిశేఖర్‌గౌడ్, సింగన పరశురాం నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల బలానికి పునాదులని, వాటిని మరింత బలోపేతం చేసి ప్రతి రైతు కుటుంబంలో సుసంపన్నత చేకూరేలా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల సమస్యలను వినిపించుకోవడమే కాకుండా వాటికి తక్షణ పరిష్కారం చూపే సమర్థత, నిజాయితీ పక్షపాతం, కూటమి ప్రభుత్వ పాలనలో మూల సూత్రాలని చెప్పారు. ఈ అభివృద్ధి పథంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములుగా చేసుకుంటూ ముందుకెళ్తామన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ చమర్తికి కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆదేపల్లి ప్రతాప్‌రాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, ఇడిమడకల కుమార్, డాక్టర్ నవీన్ చంద్ర, దివాకర్ నాయుడు, మాజీ సర్పంచ్ ఎం.ఎల్ నరసయ్య, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హిజాబ్ తొలగించాలనడం అమానుషం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో మంగళవారం పరీక్షల సమయంలో ఓ ముస్లిం విద్యార్థినిని హిజాబ్ తొలగించాలని ఓ అధికారి బలవంతం చేయడం అమానుషమని వైసిపి మైనారిటీ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, కలకడ సర్పంచ్ షావత్ అలీ ఖాన్‌లు మాట్లాడుతూ పరీక్షకు హాజరయ్యే ముందే బాధిత ముస్లిం విద్యార్థినిని భద్రతా సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీ చేశారని, అయినప్పటికీ పరీక్ష గదిలోని సిబ్బంది హిజాబ్ తొలగించాలని బలవంతం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పరీక్షా నియమావళిలో హిజాబ్ ధరించడం నిషేధం కాదని, హాల్ టికెట్ గుర్తింపు ధృవీకరణను కూడా పూర్తి చేసుకున్నప్పటికీ పరీక్షా హాలులో హిజాబ్ తొలగించాలని ఒత్తిడి చేయడం వ్యక్తిగత గౌరవానికి, మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే అన్నారు. హిజాబ్ తొలగించాలనడం రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21, 25 హక్కులకు విరుద్ధమన్నారు. పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో జరిగిన ఈ సంఘటనపై తక్షణం విచారణ జరపాలని, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత, మతపరమైన గౌరవాన్ని కాపాడే విధంగా సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. మతపరమైన ఆచారాలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఇష్తియాఖ్, కరీముల్లా, ఇస్హాఖ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలి :'గడికోట'

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

వైద్య కళాశాలలో ప్రయివేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జగన్ పిలుపుతో ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రాలను పట్టణంలోనీ నియోజక వర్గ కార్యాలయం నుంచి జిల్లా వైసిపి కార్యాలయానికి తరలించే వాహనానికి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీకాంత్ రెడ్డి, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో ఒక మెడికల్ కళాశాలను కూడా సాధించలేదన్నారు. వైసిపి హయాంలో సాధిం చిన 13 కళాశాలలు ప్రారంభమైతే జగన్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతో కళాశాలలను ప్రయివేట్ వ్యక్తులకు కట్ట బెట్టు తున్నారని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల కలలపై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్ను తోంద న్నారు. రాయచోటి ప్రజలు 55వేల పత్రాలపై సంతకాలు చేశారన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పత్రాలను 15వ తేదీన రాజధానికి పంపడం జరుగు తుంద న్నారు. ఈ నెల 17న వై.ఎస్.జగన్ నేతలతో కలిసి గవర్నర్‌కు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో మదనపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ భాష, మాజీ డిసిఎం ఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ఉపేంద్రరెడ్డి, గాలివీడు యధుభూషణ్‌రెడ్డి, బేపారి మహమ్మద్ ఖాన్, వైస్ చైర్మన్ ఫయా జుర్ రహమాన్ పాల్గొన్నారు.

వాల్మీకిపురం: మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమంతో కూటమి సర్కార్‌కు చరమగీతం పాడుదామని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో కోటి సంతకాల సేకరణపై కృతజ్ఞతాభివందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా విద్యార్థినీ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు, మేధావులు కోటి సంతకాల సేకరణలో భాగస్వా ములవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. నియోజకవర్గంలోని పీలేరు, వాల్మీకిపురం, కలికిరి, గుర్రంకొండ, కలకడ, కెవిపల్లి మండలాల నుంచి దాదాపు 32వేల సంతకాలు సేకరణ అయ్యాయన్నారు. ఈ ప్రతులను ప్రత్యేకంగా కేటాయించిన అట్టపెట్టెల్లో భద్రపరిచి, ప్రత్యేక వాహనంలో రాయచోటిలో జిల్లా పార్టీ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుబ్బారెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, ఇక్బాల్ అహ్మద్, ముక్తియార్, జగన్మోహన్ రెడ్డి, శివానంద రెడ్డి, ఆఘామొహియుద్దిన్, రవికుమార్, శివారెడ్డి, చక్రధర్, అబ్దుల్ కలీం, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, ఆనంద, చికెన్‌మస్తాన్, సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రైతులతో పశు వైద్యాధికారులు, మార్కెట్ యార్డ్ చైర్మన్

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స

ప్రజాశక్తి-రాజంపేట

ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ కడప వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చెందువారిపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 42 పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధికి చికిత్సలు, 22 పశువులకు చూలు పరీక్షలు నిర్వహించినట్లు పాంతీయ పశువైద్యశాల రాజంపేట సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ తెలిపారు. వైద్య శిబిరంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నేమ్మ నరసయ్య నాయుడు, కడప పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ రాజా తిమ్మా రెడ్డి, రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయ భాస్కరరావు పాల్గొన్నారు. అనంతరం రైతులకు ఉచిత ఎముకలపొడి, దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హత్యరాల పశు వైద్యాధికారి డాక్టర్ వేదవతి, చెర్లోపల్లి పశువైద్యాధికారి డాక్టర్ కె.భార్గవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 'ఎస్‌వి' విద్యార్థి

ప్రజాశక్తి-రైల్వే కోడూరు

చందన్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

అండర్-19 ఎస్‌జిఎఫ్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు స్థానిక ఎస్‌వి కళాశాల ఇంటర్ (ఎంపిసి)ద్వితీయ సంవత్సరం చదువు తున్న సి.ఎతిన్ చందన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌సిఎస్.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరు జిల్లాలోని మోదుకూరులో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి మూడవ వారం మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని డైరెక్టర్ ఎస్.వసుంధర, పీడీ పుల్లారావు అధ్యాపక బృందం అభినందించారు.

ఆలయ చైర్మన్‌గా సుబ్బరాజు యాదవ్

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి మండలంలోని శ్రీ దేవరాయ నల్లగంగమ్మ తల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా తొలిసారిగా బిసి వర్గానికి చెందిన కునాని సుబ్బరాజు యాదవ్ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపికి చేసిన సేవలను గుర్తించి తనను ఈ నియామకానికి ఎంపిక చేసినట్లు తెలియజేశారు. టిడిపి బిసిల పార్టీ అని మరోసారి రుజువు అయ్యిందన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు నియోజకవర్గ టిడిపి నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు విశిష్ట సేవలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లులు అప్పగించాలి

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని తూముకుంట కస్బాలో ఉన్న మహమ్మదీయ కమిటీ మెంబర్లు మసీదులో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ .12,76,000 వక్ఫ్‌బోర్డు నిధులను, సప్లైయర్స్ నిధులు రూ.15 లక్షలు , వాటర్ ప్లాంట్ నిధులను 60 కుటుంబాల ముస్లింలు ఇచ్చిన నగదుకు సంబంధించిన జమ ఖర్చులను మసీదు దగ్గర కమిటీ మెంబర్లకు అందించాలని ముతవలీగా ఉన్న మదయాలా పాప సాహెబ్ హెచ్చరించారు. డబ్బులు చెల్లించకుండా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మహమ్మదీయ కమిటీ మెంబర్లు షేక్ మహమ్మద్‌అలీ, షేక్ బాబు, షేక్ హబీబుల్లా, మహమ్మద్ అనీఫ్, బాబు, పీరా, గౌస్, మాబాషా, ఫకృద్దీన్, ఇస్మాయిల్, బాబా ఫక్రుద్దీన్, ఇమామ్ సాబ్, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మైనార్టీ ప్రముఖులను కలిసిన నాగూర్ వలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలోని మైనార్టీ ప్రముఖులతో మదనపల్లెకు చెందిన ఆర్‌టిసి 1, 2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్‌వలి బుధవారం విజయవాడలో భేటి అయ్యారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూఖ్ షుబ్లీ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ హసన్‌బాషా, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ హాజీ కె.నాగూల్ మీరాలను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలనే అంశంపై చర్చించారు. రాష్ట్రంలో ఉర్దూ బాషాభివృద్ధికి, హజ్ యాత్రికలకు కల్పించాల్సిన సౌకర్యాలు, దూదేకులను అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం దూదేకుల అభ్యున్నతికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, హజ్ యాత్రలకు గతంలో కంటే రెట్టింపు సౌకర్యాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

పాఠశాలలకు ఫర్నీచర్ అందజేత

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరక వాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలకు బుధవారం గ్రీన్ కో-సోలార్ ఆధ్వర్యంలో 12 డెస్కులు, మూడు టేబుళ్లు, ఐదు కుర్చీలు పాఠశాలకు వితరణ చేసినట్లు మండల టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సుమారు 50 మంది పిల్లలు చదువుకుంటున్నారని ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రిటైర్డ్ కావడంతో ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో విద్యార్థులు చదువులకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పాఠశాలకు వితరణ చేసిన గ్రీన్ కో సోలార్ మేనేజర్ భాషకు ఆయనతో పాటు ఆ గ్రామ టిడిపి నాయకులు గ్రామస్తులు విద్యార్థులు తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం (సోలార్) గ్రీన్ కో-మేనేజర్ భాష మాట్లాడుతూ ఈ పాఠశాలను ఒక్క యూనిట్‌గా తీసుకోని దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పాఠశాలకు త్వరలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నందలూరు కోటిరెడ్డి, సహదేవరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, బండపల్లి భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE LAKKIREDDY PALLE

O.S.No. 61/2023

పఠాన్ రహజాక్ @ రహత్‌ఖాన్ ... వాది

మరియు

1. షేక్ బాబ్‌జాన్ తండ్రి మహమద్ షరీఫ్
2. షేక్ మల్లిక తండ్రి మహమద్ షరీఫ్
3. షేక్ సత్తార్ తండ్రి మహమద్ షరీఫ్

లక్కిరెడ్డిపల్లి గ్రామము మరియు మండలం, అన్నమయ్య జిల్లా.

... ప్రతివాదులు10,11,12

నోటీసు

వాది, ప్రతివాదులైన మీపై హైకోర్టులో దావా షెడ్యూలు ఆస్తిపై హక్కు కోరి దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు కేసు వాయిదా 23.12.2025 తేదీన ఉన్నది. కావున మీరు 23.12.2025 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

కొట్టె రాజమనోహర్

వాది తరపున న్యాయవాది.

సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ తప్పనిసరి : డిఎఒ

ప్రజాశక్తి-రామాపురం

మాట్లాడుతున్న డిఎఒ శివనారాయణ

రైతులు తాము సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఇ-క్రాప్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నీలకంఠారావుపేట గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ నాగమణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి డిఎఒ హాజరై మాట్లాడుతూ రైతుల పంటలకు ప్రభుత్వం ప్రకటించిన ధర కన్నా తక్కువగా అమ్ముకోవలసిన అవసరం లేదన్నారు. రైతు సేవ కేంద్రంలో పంటను ఇ-క్రాప్ నమోదు చేసుకుంటే రైతు సేవ కేంద్రాలలో ప్రభుత్వం ప్రకటించిన ఒకటో మేలు రకం75 కిలోల బస్తాకు రూ.1792, రెండవ రకంధర రూ.1777లకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారీల మిల్లలను నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని మోసపోవలసిన పనిలేదన్నారు.ఇ-క్రాప్ నమోదు చేసుకున్న పంటల ధాన్యాలను మాత్రమే రైతు సేవ కేంద్రంలో కొనుగోలు చేస్తారన్నారు. ఎఒ మాట్లా డుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సబ్సిడీల గురించి వివరించారు. మండల ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ నీలకంఠ రావుపేట గ్రామాన్ని నేషనల్ మిషన్ ఫర్ న్యాచురల్ ఫార్మింగ్ కింద తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వీరబల్లి : రైతులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎం ఖాదర్‌వలీ కోరారు. బుధవారం స్థానిక వెలుగు కార్యక్రమంలో మండల రైతు సమాఖ్య ఆధ్వర్యంలో మండల వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, ఉపాధి, ప్రకృతి వ్యవసాయ శాఖలతో జరిగిన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ ఈ ఏడాది మండలంలో వరి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.2360 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. మొక్కజొన్న, అయిల్ ఫామ్ సాగు వల్ల ఎక్కువ ఆధాయం వస్తుందన్నారు. మండల ఉధ్యాన అధికారి వనిత మాట్లాడుతూ మామిడి సంరక్షణకు అన్ని రైతుసేవా కేంద్రాలలో సబ్సిడీతో కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల పశు వైద్యాధికారి డాక్టర్. గణేష్ మాట్లా డుతూ పశు దాణా 50 శాతం సబ్సిడీతో సిద్ధంగా ఉందన్నారు. గ్రామాల్లో నట్టల నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. ఉపాధి అధికారి చంద్రకళ మాట్లాడుతూ ఉధ్యాన పంటలకు గాను మూడు సంవత్సరాలకు సంరక్షణా నిధులు అందిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ మండల అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రపంచం ప్రకృతి వ్యవసాయ వైపు చూస్తోందని, పురుగుమందులు లేని వ్యవసాయ విధానాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు రాచన్న,కోశాధికారి రాంప్రసాద్, సిసిలు కృష్ణయ్య, నాగేంద్ర, సుధాకర్, గంగాధర్ సిబ్బంది అనిత, మరియమ్మ, జనమేజయుడు, వెంకటేష్, జ్యోతి, అనురాధపాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో లా కళాశాల ప్రారంభం

జడ్జి ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాలయాజమాన్యం

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో నూతనంగా లా కళాశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్, భారత్ అసోసియేషన్ అధ్యక్షులు హనుమంత నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాది విధులు, లా విద్య ప్రాధాన్యత, ప్రతి పౌరుడికి చట్టాలపై ప్రాథమిక అవగాహన ఎంత అవసరమో వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే న్యాయం సజావుగా అమలవుతుందని పేర్కొన్నారు. నేటి యువత అన్ని రంగాలలో ఆసక్తి చూపుతున్నప్పటికీ, లా కోర్సు వైపు ఎక్కువగా మొగ్గుచూపటం శుభ పరిణామమన్నారు. ఐఎఎస్, ఐపిఎస్, రిజిస్ట్రార్లు, రాజకీయ నాయకులు వంటి ఉన్నత స్థాయి పదవుల్లో ఉన్నవారు న్యాయవిద్యను అభ్యసిస్తే పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతూ అవినీతి తగ్గే అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. లా విద్యను అభ్యసించేందుకు చేరిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను హృదయ పూర్వకంగా అభినందించారు. తొలి బ్యాచ్ విద్యార్థులు రాబోయే వారికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. అన్నమయ్య జిల్లాలో ఇది తొలి లా కళాశాల కావడం గర్వకారణమని, లా అనేది కేవలం ఒక కోర్స్ మాత్రమే కాదని, అది సమాజానికి న్యాయాన్ని అందించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అన్నమాచార్య విశ్వవి ద్యాలయ ఛాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, వైస్ ఛాన్సలర్ సాయిబాబ రెడ్డి, ఎడ్యుకే షనల్ ట్రస్ట్ వైస్‌చైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో ఐసిఆర్‌పిలదే కీలక పాత్ర

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

గ్రామస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సూత్రాలను రైతుల వద్దకు చేర్చడంలో ఐసిఆర్‌పిలదే కీలక పాత్ర అని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. పట్టణంలోని ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఎపి కమ్యూనిటీ మేనేజ్డ్ న్యాచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎంటి, టిఎన్‌సి ఆర్పిలకు శిక్షణ శిబిరం జరుగుతోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఐ సిఆర్‌పిలో నిర్వహించాల్సిన విధులు, బాధ్య తల గురించి సమగ్రంగా వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రయోజనాలు, రసాయ న రహిత పంటల ద్వారా భూమి సారాన్ని కాపాడడం, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం వంటి అంశాల ను వివరించారు. మధ్యాహ్నం నుండి రాయ చోటి మండలం మాధవరం, బలిజపల్లె గ్రామా ల్లో ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. గురుస్వామి అనే రైతు పొలంలో ఎటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ లో సాగుచేసిన వేరు శనగ పంటలను పరిశీలించారు. వేరుశనగ వరి పంటల సరళి సాగు విధానంపై అవగా హన కల్పించడం జరిగింది. ఇన్‌పుట్ ప్రిపరేషన్ పై ద్రవ జీవమృతం, ఘన జీవామృతం తయారీ విధానం, వాటి ప్రయోజనాలు, విత్తన గుళి కల వాడడం, మిశ్రమ విత్తనం, పంటల ఎంపిక వంటి అంశాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. పొలాల్లో పలు పండ్ల పంటలతో పాటు మిశ్ర మ పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో స్థిరత భూసార పరిరక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పంటల పెరుగుదలపై వాటి ప్రభావం గురించి ప్రదర్శన నిర్వహిం చారు. కార్యక్రమం లో ప్రక ృతి వ్యవసాయ సిబ్బంది, ఎన్‌ఎఫ్‌ఎ చిరంజీవి, ఎఫ్‌ఎంటిలు, ఐసిఆర్‌పిలు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధరణికుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కలికిరి : టిడిపి నాయకుడు, ధరణి హోటల్ యజమాని పులి సత్యానా రాయణరెడ్డి తనయుడు పులి ధరణికుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ధరణి హోటల్ ఎదుట ఘనంగా నిర్వహించారు. కేకుకట్ చేసి అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా అక్కడ హాజరైన స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు ధరణి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు సంతోషంగా ఆరోగ్యంగా జీవించాలని అకాంక్షించారు. కార్యక్రమంలో బి. పురుషోత్తం రెడ్డి, జనార్ధన రెడ్డి, ఆదినారాయణరెడ్డి, అంజనకుమార్, రాకేష్ వైజాగ్, శేఖర్, మల్లి, బబులు, డ్రైవర్ వెంకీ, బావాజీ పాల్గొన్నారు.

వైసిపి నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని మాజీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి అనారోగ్యంతో నివాసంలో విశ్రాంతి తీసుకుం టున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి బుధవారం కంచి బలరాంరెడ్డి నివాసంలో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే తనకు ముఖ్యమని,ఎవరికి ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే అండగా ఉంటానన్నారు.పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించిన కంచి బలరాంరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఖలీల్ అహ్మద్, నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి,వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్ చిన్నికృష్ణ, కంచి కోదండ, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎస్ఎస్ ఫయాజ్,ప్రభుత్వ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ కంచి కళ్యాణ్ కుమార్ రెడ్డి, వైసిపి ఒకటో సచివాలయం కన్వీనర్ జి.చాంద్ బాషా, పిటిఎం మండలం బూత్ కమిటీ అధ్యక్షుడు కె.మంజునాథ్ రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, హౌసింగ్ సొసైటీ ఉపాధ్యక్షుడు కంచి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి-కలికిరి : స్థానిక మండల కేంద్రం నందు గల చౌక దుకాణాలను తహశీల్దార్ హరికుమార్ తనిఖీ చేశారు. బుధవారం పట్టణంలో గల ఎఫ్.పి దుకాణాలలో తనిఖీలు నిర్వహించి రాగులు, బియ్యం, చక్కెర సక్రమంగా అందుతున్నాయా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. సరుకులు తీసుకున్నటువంటి కార్డులను స్కాన్ చేసి వారు తీసుకున్న సరుకుల వివరాలు, ఏ వస్తువు ఎంత పరిమాణం తీసుకున్నది, వాటి ధర ఎంత అని విచారణ జరిపి, సరుకుల నాణ్యత గురించి ఆరా తీశారు. రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని, తూనికల్లో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని, సమయపాలన పాటించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో విఆర్ఒ పసాద్‌రెడ్డి, కార్డుదారులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్స్ వితరణ

ప్రజాశక్తి-గాలివీడు :మండల కేంద్రం నుంచి శబరిమలైకి వెళ్తున్న 200 మంది అయ్యప్ప భక్తులకు మెడికల్ స్టోర్ అమీన్ ఎస్.కె. నిజాముద్దీన్ , ముస్లిము మైనార్టీల ఆధ్వర్యంలో పండ్లు మెడికల్ కిట్లు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఎంపిపి మిట్టపల్లి. యదుభూషణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది శబరిమలైకి వెళ్లే భక్తులకు ముస్లిం సోదరులు పండ్లు , కిట్స్ అందించడం పరిపాటే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైద్, భూషణ నాయుడు, లతీఫ్ ,సాజిద్, అజీస్, యూనుస్, జాకీర్‌పాల్గొన్నారు.

చెత్త సేకరణ బండ్లు అందిస్తున్న ఎంపిడిఒ భాను ప్రసాద్

చెత్త సేకరణ బండ్లు పంపిణీ

ప్రజాశక్తి- కలకడ

చెత్తను సేకరించే తోపుడుబండ్లను పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ భానుప్రసాద్ తెలిపారు.మండలంలోని బాటవారిపల్లి, బాలయ్య గారి పల్లి, కలకడ, కదిరాయ చెరువు పంచాయతీలకు నాలుగు తోపుడుబండ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా ఈ గ్రామాలలో ఉన్న ఇళ్ల వద్ద నుండి పొడి చెత్తను, తడి చెత్తను సేకరించి వాటిని చెత్తతో సంపద తయారుచేయ కేంద్రానికి తరలించడానికి ఈ తోపుడు బండ్లు ఎంతో దోహదపడతా యనిపేర్కొన్నారు. వీటిని గ్రామాల్లో ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి, ఎపిఒ సుజాత, పంచాయతీ కార్యదర్శులు శైలజ, నందిని, దేవేంద్ర, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి : కెకె

ప్రజాశక్తి-చిట్వేలి : మండల అభివృద్ధికితన శాయశక్తుల కృషి చేస్తానని రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ కెకె చౌదరి పేర్కొన్నారు. పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అండగా నిలిచిన ప్రతి కార్యకర్త రుణం తీర్చు కుంటానని పేర్కొన్నారు. తనతో నడిచిన ప్రతి ఒక్కరికి తోడ్పాటు అందిస్తానని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

'తపస్య'లో ఘనంగా ఆహారోత్సవం

ప్రజాశక్తి కలికిరి: మండలంలోని రెడ్డివారిపల్లిలోని తపస్య పాఠశాలలో కరస్పాండెంట్ ఎం.రామాంజులునాయుడు, క్యాంపస్ ఇన్‌ఛార్జి ఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆహారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 160 రకాల ఆహార పదార్థాలతో ఆవరణమంతా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ మానవ జీవనంలో ఆహారం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రస్తుతం మారుతున్న మన సమాజంలో ప్రతి ఒక్కరు పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆహారపు విశిష్టతను వివరించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల వంటలు, వాటిలో గల పోషకాలను గురించి వివరించారు. విద్యార్థినీ విద్యార్థులందరూ ఉత్సాహంగా తమకి నచ్చిన వంటకాలను తీసుకుని వచ్చారు. కొందరు ఉపాధ్యాయులు శాఖాహారం, మరికొందరు మాంసాహారం చేసుకుని వచ్చి తోటి మిత్రులు అందరితో కలిసి విందు భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాధవి, ప్రేమాలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తంబళ్లపల్లె ఎంపిపి ఎన్నిక

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె ఎంపిపి ఉప ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బాపూజీ పట్నాయక్ తెలిపారు ఎంపిపిగా ఉన్న అనసూయమ్మ కుటుంబ సభ్యుల వద్దకు విదేశాలకు వెళ్తున్న నేపథ్యంలో ఈ ఏడాది అక్టోబరు 13న తన ఎంపిపి పదవికి రాజీనామా చేశారు.మండలంలోని ఎంపిటిసిల ఆమోదంతో కోసువారిపల్లె ఎంపిటిసిగా ఉన్న చిటికి శ్యామలమ్మను ఇన్‌ఛార్జి ఎంపిపిగా అక్టోబరు 27వ తేదీన ఎంపిడిఒ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ నెల 11వ తేదీన ఎంపీపీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాలు జారీ చేసింది.గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు తంబళ్లపల్లె మండలంలో ఉన్న 11 మంది ఎంపిటిసి సభ్యుల ఆమోదంతో నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చిట్వేలి : తిమ్మాయపాలెం పంచాయతీ గట్టుమీద పల్లె గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మ ృతి చెందిన అద్దంకి సురేష్ కుటుంబాన్ని మానవత్వంతో తిమ్మాయపాలెంకు చెందిన ఎన్ఆర్ఐ పురం సురేష్ టీం రూ.70వేలు నగదును బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. గతంలో కూడా రాజు కుంట సర్పంచ్ గుత్తి నరసింహ అదే కుటుంబానికి రూ.50వేలు అందజేశారు. .నిరుపేద కుటుంబాన్ని ఆపదలో ఉన్నప్పుడు తమ వంతుగా ఆదుకోవడం ఆనందంగా ఉందనిఎన్ఆర్ఐలు పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి వాహనదారుడు పాటించాలని పిటిఎం ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రతాలో భాగంగా స్థానిక బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డుభద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. లైసెన్సు, ఇన్సూరెన్స్ పత్రాలను డ్రైవర్లు తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు.ఎస్‌పి ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట లారీలు, కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు సుదూర ప్రాంతాల నుంచి వస్తూ వేకువ జామున నిద్రలోకి జారుకుని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నందున వారిని ఆపి నిద్ర నుంచి మేల్కొల్పేందుకు ఇలాంటి చర్యలు చేపడు తున్నట్లు తెలిపారు. దీని వలన కొంతవరకు ప్రమాదాలను నియంత్రించేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలోకానిస్టేబుల్ పాల్గొన్నారు.

పశు వైద్యాధికారిని నియమించాలి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని రాచపల్లి పంచాయతీలోని పశు వైద్య కేంద్రానికి వైద్యాధికారిని నియమించాలని టిడిపి నాయకులు శివారెడ్డి రవీంద్రారెడ్డి, మదన్‌మోహన్, రామ్మోహన్ కోరారు. మండలంలోని రాచపల్లిలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాచపల్లి పంచాయతీలో సుమారు 15 గ్రామాలు, హసనాపురం పంచాయతీ, వీరబల్లి మండలం వంగిమల పంచాయతీలోని వనంకాడిపల్లి, టెంకచెట్టుపల్లి, పొలిమేరపల్లి, పుతుకూరుపల్లి పంచాయతీలోని మూడు గ్రామాలలోని పశువులు గొర్రెలు ఎలాంటి అనారోగ్యానికి గురైన ఈ పశువైద్య కేంద్రానికి వస్తారని తెలిపారు. ముఖ్యమైన పశువైద్యం కేంద్రం కావడంతో పశు వైద్యులు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సంకరజాతి పాడి పశువులు ఎలాంటి అనారోగ్యానికి గురైన వైద్యులు సలహాలు, సూచనలు పాడి రైతులకు ఇవ్వాల్సిన ఉంటుందన్నారు. అధికారులు స్పందించి ఈ పశు వైద్యకేంద్రానికి రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కోరారు.

గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి-గాలివీడు : గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, శరీరంలో పెరిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే రక్తంలో ఐరన్ శాతం అధికంగా పెంపొందించుకోవాలని డాక్టర్ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి సురక్ష పథకం కింద ప్రతి నెల 9, 10 తేదీలలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని 17 గ్రామాల నుంచి 90 మంది వరకు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వరికి రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. గర్భిణులు క్రమం తప్ప కుండా వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశ వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్ బాలు , గర్భిణులు పాల్గొన్నారు.

విద్యార్థులను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో మధ్యాహ్న భోజనం వద్ద ఆ తరగతి సబ్జెక్ట్ టీచర్ పిల్లల దగ్గర ఉండి వారితో పాటు భోజనం చేసి పర్యవేక్షించాలని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాఫర్ హుస్సేన్ పేర్కొన్నారు. పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 480 మంది విద్యార్థులు ఉన్నారని, బుధవారం 460 మంది పాఠశాలకు హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రతిరోజూ పిల్లలకు టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహిస్తున్నామని సబ్జెక్టు టీచర్ ఎవరైనా రాకుంటే మరొక పాధ్యాయుడిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రులు కూడా సహకారం ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు మల్లేశ్వరమ్మ , పీడీ గంగరాజు,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఎంపిడిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లి గ్రామం పరిధిలోని కస్తూరి బాగాంధీ బాలిక విద్యాలయాన్ని స్థానిక ఎంపిడిఒ ఆదినారాయణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఇష్టపడి చదివి మంచి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయునులతో మాట్లాడుతూ విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. అనంతరం వంటగదిని పరిశీలించి అక్కడున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు

ఫ్లాగ్ డే విరాళాల సేకరణ

ప్రజాశక్తి- చిట్వేలి

30వ ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి ఆదేశాల మేరకు చిట్వేలి జడ్‌పి హైస్కూల్ ఎన్‌సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్ ఆధ్వర్యంలో బుధవారం ఫ్లాగ్ డే సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు.ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కొరకు కవచంగా ఏర్పడి ఉన్న సైనికులకు విరాళాలు విరివిగా అందించాలని తెలిపారు. రాజశేఖర్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న సైనికుల సంక్షేమం ఆర్మ్డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ప్రాముఖ్యతను వివరిస్తూ, సైనికుల త్యాగానికి గుర్తుగా ఇస్తున్న ఈ విరాళం ఎంతో విలువైనదన్నారు. సేకరించిన విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమం పాఠశాల నుండి మొదలై కొత్త బస్టాండ్, పాత బస్టాండు మీదుగా వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీతోపాటు విరాళాలను ప్రజల నుంచి వివిధ కార్యాలయలలోని అధికారుల నుండి సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, వెలుగు సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఎన్సిసి విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం..పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కురబలకోట మండలం, తెట్టు పంచాయితీ మేకలవారిపల్లె (లక్కినాయనపల్లె)కు చెందిన వెంకటరమణ అదృశ్య మయ్యాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుధవారం వెంకటరమణ కుమారుడు చిక్కె అశోక్ మాట్లాడుతూ వారం రోజుల క్రితం తన తండ్రి ఇంటి నుంచి వెళ్లాడని, రెండు మూడురోజులైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికామన్నారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించామన్నారు. మా నాన్న కోసం కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నామన్నారు. ఎక్కడికి వెళ్లాడో, ఏమయ్యాడో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 50 ఏళ్ల వయసు, ఎరుపు రంగులో ఉంటాడని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 7483814578, 8310772569 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం పుంగునూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగునూరు మండలం బండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు బయల్దేరాడు. ఇదే సమయంలో మొరంపల్లికి చెందిన కృష్ణప్ప ద్విచక్రవాహనంలో మద్రి మాకులపల్లి బయల్దేరాడు. మార్గమధ్యంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో గమనించిన స్థానికులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.